బిడ్డా.. ఖబడ్దార్..!

'బిడ్డా.. ఖబడ్దార్.. నేను ఇక్కడే పుట్టినా.. ఇక్కడే పెరిగినా. భయపెట్టాలని చూస్తే ఆ భయం ఎలా ఉంటుందో నీకు చూపిస్తా...' అంటూ అధికార పార్టీకి చెందిన జడ్పీటీసీ సభ్యుడు గోపవరం గోకుల్‌కృష్ణారెడ్డి.. ఎమ్మెల్యే శిల్పారవి చంద్ర కిశోర్ రెడ్డికి మీసం మెలేస్తూ బహిరంగ వార్నింగ్ ఇచ్చాడు. ఎమ్మెల్యే శిల్పా రవి చేసిన అరాచకాలు, కుయుక్తులన్నీ బయటపెడతానంటూ నంద్యాల జడ్పీటీసీ సభ్యుడు గోకుల్ ఏకంగా ఎమ్మెల్యేనే హెచ్చరించడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.


మీసం మెలేస్తూ ఎమ్మెల్యే శిల్పా రవికి వార్నింగ్ ఇస్తున్న గోకుల్

- నేను స్థానికుడిని.. భయపెట్టాలని చూస్తే భయపడేదిలేదు..
- ఎమ్మెల్యే శిల్పా రవికి జడ్పీటీసీ వార్నింగ్
- సొంతపార్టీ నేత హెచ్చరికలపై వైసీపీలో కలకలం
- జడ్పీటీసీ గోకుల్ ఆత్మగౌరవ యాత్రకు పోలీసుల బ్రేక్




నంద్యాల మండలం భీమవరం నుంచి భారీ ర్యాలీతో వస్తున్న వైసీపీ జడ్పీటీసీ గోకుల్ కృష్ణారెడ్డి

నంద్యాల క్రైం, జనవరి 24 : నంద్యాల వైసీపీలోని అసమ్మతి నాయకుల స్వరం పెరుగుతోంది. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని వైసీపీ నాయకుడు, నంద్యాల జడ్పీటీసీ సభ్యుడు గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి సీఎం జగన్ మోహన్ రెడ్డిని కలిసి అభ్యర్థించాడు. నంద్యాలలోని స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి స్థానికేతరుడని, ఈ దఫా టికెట్ స్థానికుడైన తనకు ఇవ్వాలని వైసీపీ రాష్ట్ర నాయకులతో గోకుల్ మంతనాలు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో నంద్యాల వైసీపీలో ఉన్న విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఈ సందర్భంగా 'స్థానికుల ఆత్మగౌరవ యాత్ర' పేరుతో గోకుల్‌కృష్ణారెడ్డి ఓ కార్యక్రమానికి పిలుపునిచ్చాడు. నంద్యాల పట్టణంలోని ఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలో ఉన్న ఆయన పార్టీ కార్యాలయం నుంచి బంగారు అంగళ్ల వీధి, గాంధీచౌక్, ఆత్మకూరు బస్టాండ్, శ్రీనివాససెంటర్, ఆర్టీసీ బస్టాండ్ నుంచి పార్టీ కార్యాలయం వరకు యాత్ర బుధవారం ఉదయం నుంచి చేపట్టాల్సి ఉంది. యాత్రకు అనుమతి కోసం డీఎస్పీ మహేశ్వరరెడ్డిని ఒకరోజు ముందుగానే కలవగా అనుమతించాడు. అనంతరం ఎస్పీ రఘువీర్‌రెడ్డిని కలిసి అనుమతి కోరడంతో ఆయన నిరాకరించారు. యాత్ర పేరుతో ర్యాలీ చేయడం వద్దని ఏదైనా ఫంక్షన్ హాల్ లేదా స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో సభను నిర్వహించుకోవచ్చని పోలీసుల నుంచి సమాధానం వచ్చింది. అయితే బుధవారం నంద్యాల మండలం భీమవరం గ్రామం నుంచి జెడ్పీటీసీ గోపవరం గోకుల్‌కృష్ణారెడ్డి తన అనుచరులు, గ్రామస్థులతో భారీ ఎత్తున ర్యాలీగా నంద్యాలలోని ఆంజనేయస్వామి సమీపంలో ఉన్న ఆయన కార్యాలయానికి చేరుకున్నాడు. అక్కడే మోహరించిన పోలీసులు స్థానికుల 'ఆత్మగౌరవ యాత్ర'కు అనుమతి లేదని అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఎస్పీ సూచన మేరకు గోకుల్ కృష్ణారెడ్డి యాత్రను చేపట్టకుండా అక్కడే బైఠాయించి వైసీపీ ఎమ్మెల్యే శిల్పా రవికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. పోలీస్ శాఖ మీద ఉన్న గౌరవంతో యాత్రను రద్దు చేస్తున్నానని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా గోకుల్ మాట్లాడుతూ వందేళ్లకుపైగా ఇక్కడే ఉన్నామన్నారు. నంద్యాలలో స్థానికేతరులు వచ్చి రాజకీయాలు చేస్తూ నంద్యాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని వైసీపీ రాష్ట్ర అధిష్ఠానాన్ని అభ్యర్థించినట్లు తెలిపారు. ఇదే సమయంలో ఉద్వేగానికి లోనైన గోకుల్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిని ఉద్దేశిస్తూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 'బిడ్డా.. ఖబడ్దార్ ఈన్నే పుట్టిపెరిగినోన్ని.. భయపెట్టాలని చూస్తే ఆ భయం ఎలా ఉంటుందో చూపిస్తా...' అంటూ మీసం మెలేస్తూ ఎమ్మెల్యేకు వార్నింగ్ ఇచ్చారు. ఎమ్మెల్యే శిల్పా రవి చేసిన అరాచకాలు, కుయుక్తులను బయటపెడ్తానని హెచ్చరించారు.

అధిష్ఠానం సూచన మేరకు పోటీ

-మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి


రాతనలో మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

తుగ్గలి, జనవరి 24: ఎన్నికల్లో పోటీకి సంబంధించి మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి స్పందించారు. టీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని ఆయన వెల్లడించారు. బుధవారం తుగ్గలి మండలంలోని రాతన గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లే జగన్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. పార్టీ అధిష్ఠానం మేరకు ఎంపీ అయినా, ఎమ్మెల్యేగా అయినా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రతి నియోజకవర్గంలో గెలుపొందేలా ముందస్తు ప్రణాళికల్లో భాగంగానే టికెట్లను కేటాయిస్తున్నారని కోట్ల చెప్పారు. ఈ సమావేశంలో తెలుగు రైతు జిల్లా నాయకుడు మనోహర్‌చౌదరి, నాయకులు గోవిందరెడ్డి, ప్రమోద్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాతిరెడ్డికి 'ఉరవకొండ' బాధ్యతలు

- టీడీపీ పరిశీలకుడిగా నియామకం



నంద్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసిరెడ్డిని అనంతపురం జిల్లా ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడిగా నియమిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. తులసిరెడ్డి టీడీపీలో చేరిన తర్వాత పార్టీ అధిష్ఠానం రాష్ట్ర కార్యదర్శిగా నియమించి ఆయనకు సముచిత స్థానం కల్పించింది. పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తుండటంతో తులసిరెడ్డికి ఉరవకొండ బాధ్యతలు అప్పగించింది. ఉరవకొండ ఎమ్మెల్యేగా ఉన్న పయ్యావుల కేశవ్ సారథ్యంలో ఆయన పనిచేయనున్నారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ పార్టీ తనకు ఎలాంటి బాధ్యత అప్పగించినా చిత్తశుద్ధితో నిర్వహిస్తానని, వచ్చే ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు.


బీసీ జయహో సదస్సులో మాట్లాడుతున్న గౌరు చరిత

తెలుగుదేశం బీసీల పార్టీ

- పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గౌరు చరిత

పాణ్యం, జనవరి 24: బీసీలకు రాజ్యాధికారంతో ఉన్నత స్థానంలో నిలిపిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని మాజీ ఎమ్మెల్యే, పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గౌరు చరిత పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద 'జయహో బీసీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గౌరు చరిత మాట్లాడుతూ... బీసీల సంక్షేమానికి టీడీపీ వెన్నెముగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో 60 శాతం మంది బీసీలుండగా పది శాతానికి రిజర్వేషన్లు తగ్గించి వైసీపీ అన్యాయం చేసిందన్నారు. స్పీకర్, టీటీడీ ఛైర్మన్, ఆర్థిక శాఖ మంత్రి, తదితర కీలక పదవులను టీడీపీ బీసీలకే కేటాయించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ హాస్టళ్లలో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్పొరేషన్లను నిర్వీర్యం చేసి సబ్‌ప్లాన్ నిధులు ఇతర శాఖలకు మళ్లించిన సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం చేశాడన్నారు. టీడీపి మానిఫెస్టోలో బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేస్తున్న మొట్టమొదటి పార్టీగా టీడీపి నిలుస్తుందన్నారు. సంపదను సృష్టించే పార్టీగా టీడీపి అవతరించిందన్నారు. వైసీపి అధికారంలోకి రాగానే ప్రజా వేదికను కూల్చి తన నైజాన్ని బయటపెట్టిందన్నారు. అన్న క్యాంటీన్లు లేకుండా చేసి పేదల కడుపు కొట్టిందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో 74 మంది బీసీలు హత్యకు గురయ్యారన్నారు. బీసీల భూములు, వక్ఫ్ భూములను వైసీపీ నేతలు కబ్జా చేశారని గౌరు చరిత ఆరోపించారు. పాణ్యం నియోజకవర్గంలో 40 వేల ఎకరాల్లో పారిశ్రామికవాడ, ఎయిర్‌పోర్టు, సోలార్, ఉక్కు పరిశ్రమలు టీడీపీ హయాంలో ఏర్పాటైతే వైసీపీ చేసినట్లు ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు నంద్యాల రవి, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మహేశ్ గౌడ్, గొర్రెల, మేకల పెంపకం సంఘం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, కన్వీనర్ గణపం జయరామిరెడ్డి, రాష్ట్ర టీడీపి లీగల్ సెల్ కార్యదర్శి రామ్మోహన్‌నాయుడు, ఎంపీటీసీలు భాస్కరరెడ్డి, రంగరమేష్, బీసీ సెల్ మండలాధ్యక్షుడు నంద్యాల రవికుమార్ పాల్గొన్నారు.

తాడేపల్లికి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

- ఇన్‌చార్జి మార్పుపై పునరాలోచనలో వైసీపీ

ఎమ్మిగనూరు, జనవరి 24: ఎమ్మిగనూరు వైసీపీ ఇన్‌చార్జి మార్పు అనివార్యంగా కనిపిస్తోంది. పార్టీ అధిష్ఠానం ఎమ్మెల్యేల మార్పులు.. చేర్పుల్లో భాగంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించిన మాచాని వెంకటేష్‌ను నియోజకవర్గం ఇన్‌చార్జిగా నియమించింది. అయితే మాచాని వెంకటేష్‌కు పార్టీ సర్వేల్లో అనుకూలత లేకపోవటం, ఎమ్మెల్యే తనయుడు జగన్మోహన్‌రెడ్డి, ముఖ్య అనుచరులు అసంతృప్తి వ్యక్త చేశారు. దీంతో పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి ఎమ్మెల్యేతో చర్చలు జరిపారు. ఎమ్మెల్యే ససేమిరా అన్నారు. అంతేగాక పార్టీ నాయకులతో మండలాల వారిగా సమావేశాలు ఏర్పాటు చేసి మాచాని వెంకటేష్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. అయినా సర్వేల్లో ఆశించిన స్థాయిలో అనుకూలత రాలేదని అధిష్ఠానం పునరాలోచనలో పడినట్లు సమాచారం. బుధవారం అధిష్ఠానం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని తాడేపల్లికి పిలిపించటంతో ఆయన బయలుదేరి వెళ్లారు. ఈ పరిణామాలను బట్టి చూస్తే ఎమ్మిగనూరు వైసీపీ ఇన్‌చార్జి మార్పు అనివార్యంగా కనిపిస్తోంది. దీంతో ఆశావాహులైన వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఛైర్మన్ వై రుద్రగౌడ్, మాజీ ఎంపీ బుట్టా రేణుకలకు వైసీపీ ఎమ్మెల్యే సీటుపై ఆశలు చిగురించాయన్న చర్చ కొనసాగుతోంది

మంత్రుల సభా? మజాకా?

- పొదుపు మహిళలను తీసుకరావాలని వైసీపీ హుకుం
- లేకుంటే చర్యలని బెదిరింపు
- మంత్రికి చివరి మీటింగ్ అట..
- ప్రతి మెప్మా ఆర్పీ 50 మందిని తరలించాల్సిందే


డోన్ మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఆర్పీలతో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సమావేశం

డోన్, జనవరి 24: డోన్‌కు ముగ్గురు మంత్రులు వస్తున్నారు.. వీరి సభను విజయవంతం చేసేందుకు పొదుపు మహిళలను తీసుకురండి.. లేదంటే చర్యలు తప్పవు.. అని అధికార వైసీపీ నాయకులు మెప్మా ఆర్పీలకు హుకుం జారీ చేశారు. బుధవారం డోన్ పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో వైసీపీ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మెప్మా ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 28వ తేదీన పట్టణంలో వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించేందుకు ముగ్గురు మంత్రులు వస్తున్నారని తెలిపారు. మంత్రి బుగ్గన ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు పొదుపు మహిళలను పెద్ద ఎత్తున తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. మున్సిపాలిటీలో మొత్తం 44 మంది ఆర్పీలు ఉన్నారని, ఒక్కో ఆర్పీ 50 మంది పొదుపు మహిళలను తీసుకురావాలని హుకుం జారీ చేశారు. ఆర్పీలు ఇంటింటికి తిరిగి పొదుపు మహిళలను సమీకరించాలని ఆదేశించారు. డోన్‌లో మంత్రుల లాస్ట్ మీటింగ్ జరుగుతుందని, తర్వాత ఎన్నికల కోడ్ వస్తుందని, అందుకోసం పెద్ద ఎత్తున పొదుపు మహిళలను తరలించాలని ఆర్పీలకు టార్గెట్లను నిర్ణయించారు. మంత్రుల సభకు పొదుపు మహిళలను తీసుకురాకపోతే సంబంధిత మెప్మా ఆర్పీలపై చర్యలు తప్పవని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ టార్గెట్లను చూసి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

అహోబిలేశుడికి ప్రత్యేక పూజలు


ఆలమూరులో పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి

రుద్రవరం, జనవరి 24: మండలంలోని ఆలమూరు గ్రామంలో బుధవారం పార్వేట పల్లకీలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీనరసింహస్వామి, ప్రహ్లాద వరద స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అహోబిళ క్షేత్రంలో మకర సంక్రాంతిన ప్రారంభించిన పార్వేట పల్లకీ రుద్రవరం మండలం ఆలమూరు గ్రామం చేరుకోవడంతో ప్రత్యేక పూజలు చేశారు. పార్వేట పల్లకి గ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో సందడి నెలకొంది.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ మండలంలో మొదటి విడతగా అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట యాదవాడ గ్రామంలో ముగిసింది. ఈ నెల 16వ తేదిన ప్రారంభమైన ఉత్సవ పల్లకీ పర్యటన బాచేపల్లె, కొండంపల్లె, ఆర్.క్రిష్ణాపురం, కోటకందుకూరు, మర్రిపల్లె, యాదవాడ గ్రామాల్లోని తెలుఫుల వద్ద పల్లకి విడిది చేయడంతో ప్రజలు పూజలు చేశారు. తిరిగి రెండో విడత పర్యటన ఈ నెల 30వ తేదీన బాచ్చాపురం మెట్ట వద్ద ప్రారంభమై ఫిబ్రవరి 13వ తేదీన గూబగుండం గ్రామంలో ముగుస్తుంది.

అమ్మో.. అవుకు..!

- ఆ స్టేషన్‌కు వెళ్లడానికి బెంబేలెత్తుతున్న ఎస్ఐలు
- ఏడు నెలల్లో ముగ్గురు వీఆర్‌కు



అవుకు, జనవరి 24: అవుకు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించాలంటే పోలీస్ అధికారులు డీలా పడిపోతున్నారు. 'అబ్బా... ఆ స్టేషనా...' అంటూ నిట్టూరుస్తున్నారు. అవుకు పోలీస్ స్టేషన్ పరిధిలో రాజకీయ ఒత్తిళ్ల ఒక ఎత్తయితే, అవినీతి ఆరోపణలతో మరి కొందరు అధికారులు వీఆర్‌కు వెళ్తున్నారు. గడిచిన ఏడు నెలల్లో ముగ్గురు ఎస్ఐలు అవుకు స్టేషన్‌ను బదిలీ అయ్యారంటే ఇక్కడి పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతుంది. తాజాగా అవుకు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించిన విష్ణునారాయణపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయాల్సిన ఎస్ఐ స్థాయి అధికారులే అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో అందరి చూపు అవుకు స్టేషన్‌పై పడింది. ఎస్ఐ విష్ణునారాయణ గత ఏడాది అక్టోబరు నెలలో అవుకుకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. స్టేషన్ ఆవరణలో ఉంచిన 27 నాపరాయికోత మిషన్ల గల్లంతు కావడం, ఎస్ఐ పనితీరుపై స్థాయి పోలీసులు అసంతృప్తితో పాటు వివిధ వర్గాల ప్రజల నుంచి పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఎస్ఐ తక్షణమే జిల్లా పోలీస్ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.

గతంలోనూ ఇంతే..!

గతంలో సుదీర్ఘ కాలంగా ఎస్ఐగా పనిచేసిన ఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డి సమర్థవంతంగా పనిచేసినా చివరిలో రాజకీయ రంగు పులుముకొని వీఆర్‌కు వెళ్లారు. అనంతరం ఎస్ఐగా వచ్చిన నరేంద్ర ఎర్రమల్ల కొండల్లో జరుగుతున్న పేకాట స్థావరంపై దాడి జరిపి భారీ మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ నగదు చేతులు మారినట్లు ఆరోపణలు రావడంతో నరేంద్రను కూడా వీఆర్‌కు పంపుతూ అప్పట్లో ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 4 నెలల క్రితం వచ్చిన విష్ణునారాయణ పలు అవినీతి ఆరోపణలతో వీఆర్‌కు వెళ్లారు. ఇలా ఏడు నెలల కాల వ్యవధిలోనే అవుకు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విదులు నిర్వహించిన ముగ్గురు ఎస్ఐలు వీఆర్‌కు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

రికార్డులను తెప్పించుకున్న డోన్ డీఎస్పీ

విజిలెన్సు అధికారులు 2016లో చెర్లోపల్లె పరిధిలో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న నాపరాయి గనులపై దాడులు నిర్వహించి 32 నాపరాయి కోత మిషన్లను స్వాధీనం చేసుకుని అవుకు స్టేషన్‌కు అప్పగించారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న 30 మందిపై అప్పట్లో కేసులు నమోదు చేశారు. వారం క్రితం 27 నాపరాయి కోత మిషన్లు గల్లంతైన వ్యవహారంలో రూ.4లక్షలకు ఎస్ఐ విష్ణునారాయణ గుజిరీకి విక్రయించి సొమ్ము చేసుకున్నాడన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండానే నాపరాయి కోత మిషన్లను ఎస్ఐ విక్రయించినట్లు డిపార్ట్‌మెంట్‌లో చర్చ సాగుతోంది. బుధవారం డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అవుకు స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను బనగానపల్లెకు తెప్పించుకుని విచారణ చేపట్టారు. నిబంధనలను అతిక్రమించడంతో పాటు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐ విష్ణునారాయణపై ఉన్నతస్థాయి పోలీస్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది.

ప్రజలకు చేరువయ్యేలా పని చేయాలి

- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్
- టీడీపీ శ్రేణులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ



ఇంటిగ్రేటెడ్ సమీక్షలో మాట్లాడుతున్న బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), జనవరి 24: చంద్రబాబు, నారా లోకేశ్ నాయకత్వంలో టీడీపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని తిరుపతి-నెల్లూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాయలసీమలోని కర్నూలు, నంద్యాల, కడప, అనంతపురం, హిందూపురం, పరిధిలోని 36 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన టీడీపీ నాయకులకు ఒక రోజు ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో పాటు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు పార్టీ నాయకులు చేరువకావాలన్నారు. సాంకేతిక అంశాలను రాజకీయాలకు జోడించి అన్ని విధాల నాయకులను తయారు చేయడం జరిగిందన్నారు. గ్రామ. బూత్ స్థాయిల్లో ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు జోన్ల వారీగా శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో ఓటర్ వెరిఫికేషన్, బాబు షూరిటీ..భవిష్యత్ గ్యారెంటీ, కుటుంబ సాధికారత సారథుల నియామకం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. సీఎం జగన్ జాబ్ కేలండర్ పేరుతో యువతను మోసం చేశాడన్నారు. సీఎం జగన్ అన్ని వర్గాలకు చేసిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి 120 మంది ఓటర్లకు ఒక గృహసారథి ఉంటారన్నారు. అధికారంలోకి వచ్చాక టీడీపీ ప్రభుత్వం చేపట్టబోయే పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, అంబికా లక్ష్మీనారాయణ, నాయకులు ఆకెపోగు ప్రభాకర్, అంబటి లక్ష్మీనారాయణ, సత్రం రామకృష్ణుడు, డి.జేమ్స్, ఎస్.ముంతాజ్, తిలక్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు ముఖ హాజరు



కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 24: ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం ముఖ హాజరును తప్పనిసరి చేసింది. ఉదయం, సాయంత్రం ఫొటో తీసి నమోదు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఫిబ్రవరి నుంచి అమలవుతాయని అధికార వర్గాలు తెలిపాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు మూడున్నర లక్షల మందికి ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డులు ఇచ్చారు. వీరిలో కొందరు వలస వెళ్లిపోగా దాదాపు 80వేల నుంచి లక్ష మంది దాకా ప్రస్తుతం ఉపాధి పనులు చేస్తున్నారు. గ్రామాల్లో వైసీపీ నాయకులు, వారి అనుచరులు బోగస్ కూలీలను చేర్పించి ఈ పథకం నిధులను స్వాహా చేస్తున్నారు. సామాజిక తనిఖీలు చేస్తున్నా అక్రమాలను అరికట్టడంలో అధికారులు ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లోని తమ అనుచరులకు ఉపాధి కల్పించేందు కోసం ఈ పథకం బాగా ఉపయోగపడుతుందని వైసీపీ నాయకులు అనుకున్నారు. అయితే.. కేంద్ర ప్రభుత్వం ముఖ హాజరును తప్పనిసరి చేయడంతో నాయకులు ఇబ్బందిపడుతున్నారు.

ఇంకా ఉత్తర్వులు అందలేదు: అమర్నాథ్‌రెడ్డి, డ్వామా పీడీ: ఉపాధి హామీ పథకంలో ముఖ హాజరు గురించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఇంకా రాలేదు. అవి వచ్చాకే నిబంధనల అమలుకు చర్యలు తీసుకుంటాం.

ప్రారంభమైన జేఈఈ మెయిన్స్ పరీక్షలు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 24: ఎన్‌ఐటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జేఈఈ-మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో ఉన్న అయాన్ డిజిటల్ కేంద్రంలో పరీక్ష జరిగింది. మొదటి రోజున బీఆర్క్, బ్యాచ్‌లర్ ఆఫ్ ప్లానింగ్ పేపర్ పరీక్ష జరిగింది. ఈ పరీక్ష మధ్యాహ్నం 3 నుంచి 6:30 గంటల వరకు కొనసాగింది. అభ్యర్థులు వారి తల్లిదండ్రులు, బంధువులు పరీక్షా కేంద్రాలకు నిర్ణయించిన సమయం కంటే రెండు గంటల ముందే చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతం రద్దీగా కనిపించింది. పరీక్ష నిర్వాహకులు లాకర్స్‌ను ఏర్పాటు చేశారు. కానీ చార్జెస్ అధికంగా వసూలు చేయడంతో అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష ప్రశాంతంగా జరగడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. ఈనెల 27, 28, 29, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో బీటెక్ కోర్సులకు ఆన్‌లైన్ పరీక్షలు జరగనున్నాయి.

సర్వర్ డౌన్ : విద్యార్థుల టెన్షన్

జేఈఈ-మెయిన్స్ ఆన్‌లైన్‌లో బుధవారం జరిగిన పరీక్షలో సర్వర్ డౌన్ కావడంతో అభ్యర్థులు ఆందోళన చెందారు. దాదాపు ఒక గంట సమయం వరకు సర్వర్ పని చేయలేదు. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. సర్వర్ డౌన్ కారణంగా కోల్పోయిన సమయాన్ని అదనంగా కేటాయించడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

టీపీఎస్ హరీష్‌చౌదరి అహుడాకు బదిలీ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 24: నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలో పని చేస్తున్న టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్(టీపీఎస్) హరీష్ చౌదరిని అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అహుడా)కు బదిలీ చేశారు. ఈ మేరకు టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఆర్‌జే.విద్యులత బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది పాటు ఫారిన్ సర్వీస్ కింద అహుడాలో విధులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఓటరు జాబితాను చూపారని వీఆర్‌ఏకు షోకాజ్ నోటీసు

మద్దికెర, జనవరి 24: కొత్త ఓటర్ల జాబితాను తెలుగుదేశం పార్టీ నాయకులకు చూపించారని వీఆర్‌ఏ ఆనంద్‌కు తహసీల్దార్ నాగభూషణం బుధవారం షోకాజ్ నోటీసు ఇచ్చారు. మద్దికెర గ్రామంలోని ఓటరు జాబితాను బూత్‌లెవల్ అధికారుల ఆదేశాల మేరకు వీఆర్‌ఏ ఆనంద్ స్థానిక టీడీపీ నాయకులకు చూపించారని, టీడీపీ నాయకుల వెంట రెండు ఇళ్లకు వెళ్లారని స్థానిక వైసీపీ నాయకులు పత్తికొండ ఆర్డీవో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తమ అనుమతి లేకుండా టీడీపీ నాయకులకు ఓటరు జాబితాను ఎలా చూపించారని వాగ్వాదానికి దిగారు. సంబంధిత వీఆర్‌ఏను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయనను ఉద్యోగం నుంచి తొలగించే వరకు వదిలే ప్రసక్తి లేదని ఒత్తిడి తెచ్చారు. దీంతో గత్యంతరం లేక రెవెన్యూ అధికారులు వీఆర్‌ఏ ఆనంద్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఈ విషయంపై తహసీల్దార్ నాగభూషణం మాట్లాడుతూ కొంతమంది ఫిర్యాదు మేరకు షోకాజ్ నోటీసు ఇచ్చానని అన్నారు.

పెళ్లి వేడుకలో ఘర్షణ : యువకుడికి కత్తిపోట్లు

నంద్యాల క్రైం, జనవరి 24 : నంద్యాల నందమూరినగర్‌లో మంగళవారం అర్ధరాత్రి ఓ వివాహ వేడుకలో ఘర్షణ జరిగింది. డీజే పాటలను మార్చే విషయంలో యువకుల మధ్య జరిగిన ఘర్షణ కత్తిపోటుకు దారి తీసింది. పెళ్లిలో డీజే కార్యక్రమంలో యువకులు ఫుల్లుగా మద్యం తాగి డ్యాన్స్ చేశారు. ఇందులో భాగంగా పాటలను మార్చుతూ ఇరువర్గాల వారు ఘర్షణకు దిగారు. షేక్ నూర్‌బాషాపై ప్రదీప్‌గౌడ్, సంతోష్ అనే యువకులు కత్తితో దాడిచేసి గాయపరిచారు. నూర్‌బాషాను నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నంద్యాల తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అనారోగ్యంతో గిరిజనుడు మృతి

- మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు డబ్బుల్లేక భార్య అవస్థలు



ఆత్మకూరు వైద్యశాల వద్ద భర్త మృతదేహం పక్కన రోధిస్తున్న భార్య అంకమ్మ

కొత్తపల్లి, జనవరి 24: చెంచు గూడేనికి చెందిన వ్యక్తి అనారోగ్యంతో ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందాడు. మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లి దహన సంస్కారాలు చేసేందుకు కూడా డబ్బులు లేక భార్య ఇబ్బందిపడింది. ఆమె రోదన చూపరులను కంటతడి పెట్టించింది.. కొత్తపల్లి మండలం పెద్ద గుమ్మడాపురం గిరిజన గూడేనికి చెందిన నిమ్మల బాలస్వామి (52) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం బాలస్వామికి ఉన్న ఫలంగా ఆయాసం, దగ్గు ఎక్కువ కావడంతో భార్య అంకమ్మ అతికష్టమీద భర్తను ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చింది. అక్కడి కోలుకోలేక బాలస్వామి మృతి చెందాడు. తన భర్త మృతదేహాన్ని దహన సంస్కారాల కోసం ఇంటికి తీసుకెళ్లేందు కూడా ఆమె దగ్గర చిల్లిగవ్వ లేదు. ఈ పరిస్థితి తెలుసుకున్న కొందరు ఎర్రమఠం ప్రభుత్వ వైద్యశాలకు చెందిన డా. జబీర్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే స్పందించి మృతదేహాన్ని పెద్ద గుమ్మడాపురం గూడేనికి తీసుకెళ్లేందుకు ఆటోను పంపించి కొంత ఆర్థిక సాయం అందించారు. మృతునికి ఐదుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నప్పటికీ ఎవరూ రాకపోవడంతో భర్త మృతదేహాన్ని భార్య అంకమ్మనే తీసుకెళ్లింది.

నంద్యాల జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా అనసూయ

కర్నూలు(హాస్పిటల్), జనవరి 24: వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 పరిధిలో సీనియర్ హెడ్ నర్సులకు పదోన్నతులు లభించాయి. ఈ మేరకు మంగళవారం కడపలో రీజినల్ డైరెక్టర్ రత్నకుమారి హెడ్ నర్సులకు నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2లుగా పదోన్నతుల కౌన్సిలింగ్ నిర్వహించారు. కర్నూలు జీజీహెచ్ సీటీవీఎస్ డిపార్టుమెంట్‌లో పని చేస్తున్న జి.అనసూయ నంద్యాల జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2గా పదోన్నతి కల్పించి పోస్టింగ్ వేశారు. అనంతపురానికి చెందిన సీనియర్ హెడ్ నర్సులు ఏ. పద్మావతి, బి. పద్మావతిలను ఆదోని జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్లు గ్రేడ్-2లుగా పదోన్నతి కల్పించి ఆర్‌డీ పోస్టింగ్‌లు వేశారు. పదోన్నతులు పొందిన వారు ఈ నెల 31న విధుల్లో చేరాలని కడప ఆర్‌డీ ఆదేశాలు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి

ప్యాపిలి, జనవరి 24: మండలంలోని చిగురుమాను మిట్ట దగ్గర బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మద్దిలేటి(48) మృతి చెందారు. మండలంలోని గార్లదిన్నె గ్రామానికి చెందిన మద్దిలేటి గొర్రెలను మేపుకొనేందుకు చిగురుమాను మిట్ట దగ్గరకు వెళ్లారు. తిరిగి గొర్రెలను తోలుకొని గార్లదిన్నెకు వస్తుండగా చిగురుమాను మిట్ట సమీపంలో ట్రాక్టర్ ఢీకొనడంతో మద్దిలేటి అక్కడికక్కడే మృతి చెందారు. మద్దిలేటి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జలదుర్గం పోలీసులు తెలిపారు.

యువ కెరటాలు 44,273



- తొలిసారిగా ఓటరుగా నమోదు చేసుకున్న యువతరం
- ఫలించిన స్వీప్ కార్యక్రమం
- గతేడాదితో పోలిస్తే పెరిగిన 18-19 ఏళ్ల ఓటర్లు 69.56 శాతం
- రాష్ట్రంలోనే ప్రథమ స్థానం

కర్నూలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): యువతరం ఓటర్లుగా మారితే ఎన్నికలకు కొత్త రక్తం వస్తుంది. ఎదిగే తరం భాగస్వామ్యం వల్ల ప్రజా ప్రాతినిధ్యం నిర్ణయాత్మకంగా మారుతుంది. ప్రజాస్వామ్యం క్రియాశీలం అవుతుంది. అందుకే అర్హులైన యువతీ యువకులందరూ ఓటరుగా నమోదు కావాలి.. అనర్హులు ఏ ఒక్కరు జాబితాలో పేరు ఉండకూడదు. ఇది కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యం. ప్రధానంగా 18-19 ఏళ్ల యువత కాలేజీల్లో ఉంటారు. వీరు ఓటరు నమోదుపై ఆసక్తి చూపడం లేదు. దీంతో సీఈసీ ఇలాంటి యువతను గుర్తించి ఓటరుగా నమోదు చేసేందుకు సిస్టమాటిక్ ఓటర్స్ ఎన్‌రోల్‌మెంట్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం' (స్వీప్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్పెషల్ సమ్మరి రివిజన్-2024లో భాగంగా ఎన్నికల అధికారులు విద్యా సంస్థలు, కోచింగ్ సెంటర్లకు వెళ్లి ఓటరు నమోదు చేయించారు. ఫలితంగా 44,273 మంది నూతనంగా ఓటరుగా నమోదు అయ్యారు. ఇది రాష్ట్రంలోనే ప్రథమ స్థానం. రాబోయే ఎన్నికల్లో ప్రథకంగా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఫలించిన 'స్వీప్' కార్యక్రమం

అర్హులైన 18-19 ఏళ్ల యువతను ఓటర్లగా నమోదు చేయాలనే లక్ష్యంగా 'సిస్టమాటిక్ ఓటర్స్ ఎన్‌రోల్‌మెంట్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం' (స్వీప్)కు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) శ్రీకారం చుట్టింది. అక్టోబరు 27 నుంచి డిసెంబరు 9వ తేది వరకు ప్రతివారం ఎన్నికల అధికారులు వివిధ విద్యా సంస్థలు, కోచింగ్ సెంటర్లకు వెళ్లి ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. అంతేకాదు.. అక్కడే బీఎల్‌ఓలు వారి నుంచి ఫారం-6తో పాటు అవసరమైన ధృవపత్రాలు స్వీకరించారు. ఓటరుగా నమోదు చేయించారు. స్వీప్ కార్యక్రమం ఫలితం ఇవ్వడంతో 44,273 మంది తొలిసారిగా ఓటర్ల జాబితాలో ఓటు హక్కు పొందారు. రాబోయే ఎన్నికల్లో ప్రథకంగా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. గత ఏడాది జనవరి 5న విడుదల చేసిన ఎస్‌ఎస్‌ఆర్-2023 జబితా ప్రకారం 18-19 ఏళ్ల యువత 13,474 ఓటర్లుగా నమోదు అయితే.. సోమవారం విడుదల చేసిన ఎస్‌ఎస్‌ఆర్-2024 జాబితా ప్రకారం 44,273 మంది నూతనంగా ఓటు హక్కు పొందారు. గతేడాదితో పోలిస్తే 30,799 మంది నవ ఓటర్లు పెరిగారు. అంటే.. 69.56 శాతం పెరుగుదల నమోదు చేసుకోవడం కొసమెరుపు. అత్యధికంగా పాణ్యంలో 7,618 మంది.. అత్యల్పంగా ఆదోనిలో 4,815 ఓటర్లు నమోదు అయ్యారు. యువ ఓటర్ల నమోదులో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం దక్కించుకుంది.

గడువు ముగిసిన తరువాత కూడా..

అక్టోబరు 27 నుంచి డిసెంబరు 9వ తేది వరకు 'స్పెషల్ సమ్మరి రివిజన్-2024' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా స్థాయి నుంచి బూత్ లెవల్ స్థాయి వరకు అని దశల్లో ఎన్నికల అధికారులు ఈ కార్యక్రమంలో నిమగ్నం అయ్యారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. అంతేకాదు.. నవంబరు 4,5, డిసెంబరు 2,3వ తేదిల్లో ప్రత్యేక ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. గడువు ముగిసినా డిసెంబరు 10 నుంచి జనవరి 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయడం కొసమెరుపు. ఈ సమయంలో ఓటు నమోదు కోసం ఫారం-6 దరఖాస్తులు 24,504 రాగా 15,212 పరిష్కరించగా 9,291 పెండింగ్‌లో ఉన్నాయి. ఓటు తొలగింపు కోసం ఫారం-7 దరఖాస్తులు 13,723 రాగా 9,938 పరిష్కరించారు. 3,785 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది. ఫారం-8 దరఖాస్తులు 9,827 రాగా 6,439 పరిష్కరించగా 3,390 పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని వెబ్‌సైట్ పునఃప్రారంభం అయిన తరువాత పరిష్కరిస్తామని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

కర్నూలు(కలెక్టరేట్),జనవరి24: జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.సృజన తెలిపారు. అర్హత కలిగి ఓటర్లగా నమోదు కాని వారు సంబంధిత బీఎల్వో, ఏఈఆర్‌ఓ, ఈఆర్‌ఓ, ఓటరు హెల్ప్ లైన్ మొబైల్ యాప్ ద్వారా లేదా ఫారం 6 ద్వారా ఓటు నమోదు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

నేడు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 24: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ ఏ.భార్గవతేజ తెలిపారు. సి. క్యాంపు, పాతబస్టాండ కొండారెడ్డి బురుజు, కేవీఆర్ కళాశాల మార్గాల నుంచి ర్యాలీ బయలుదేరి జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ముగుస్తుందన్నారు. జిల్లాలోని విద్యార్థులు, యువకులు ఈ ర్యాలీలో పాల్గొని జాతీయ ఓటరు దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సుద్దముక్కతో ఓటు నమూనా



ప్యాపిలి, జనవరి 24: మండలంలోని వెంగళాంపల్లి గ్రామానికి చెందిన చిత్రకారుడు మధుకృష్ణ సుద్దముక్కతో ఓటు నమూనాను బుధవారం తయారు చేశారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నమూనాను తయారు చేసినట్లు చిత్రకారుడు తెలిపారు. ఓటు వజ్రాయుధం లాంటిదని ప్రతి ఓటరు ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని మధుకృష్ణ ఓటర్లకు పిలుపునిచ్చాడు.

● నియోజకవర్గం వారిగా ఓటర్లుగా నమోదు అయిన 18-19 ఏళ్ల యువత

నియోజకవర్గం	2023	2024	పెరుగుదల
కర్నూలు	3,648	5,759	2,111
పాణ్యం	2,249	7,618	5,369
పత్తికొండ	1,398	5,009	3,611
కోడుమూరు (ఎస్సీ)	1,157	5,433	4,276
ఎమ్మిగనూరు	1,886	5,807	3,921
మంత్రాలయం	875	4,919	4,044
ఆదోని	922	4,815	3,893
ఆలూరు	1,339	4,913	3,574
మొత్తం	13,474	44,273	30,799

కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటు చేయండి

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 24: సాధారణ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కమ్యూనికేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ జి.సృజన నోడల్ అధికా రులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ లో కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమ్యూనికేషన్ సెంటర్ ద్వారా ఎన్నికల నిర్వహణకు సంబం ధించిన అన్ని అంశాలను పర్యవేక్షిస్తామన్నారు. అన్ని నియోజకవర్గాల సమాచార సేకరణకు వీలుగా కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా సమాచార పర్యవేక్షణకు వీలుగా టీవీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతుల వివరాల సమాచారాన్ని సేకరించాలని నోడల్ అధికారులను ఆదేశిం చారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్ రావు, సీపీవో హిమ ప్రభాకర్ రాజ్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

పది రోజుల్లో పనులు పూర్తి చేయండి : కలెక్టర్ కార్యాలయంలో సునయన ఆడిటోరియం, ఏవో కార్యాలయ గదులు, అన్ని సెక్షన్ల గదులలో జరుగుతున్న మరమ్మతుల పనులను బుధవారం కలెక్టర్ జి.సృజన పర్యవేక్షించారు. రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్‌ను వెంటనే పనులు పూర్తి చేసే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్‌రావు, రోడ్ల భవనాల శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ సురేష్, కలెక్టరేట్ ఏవో శ్రీనాథ్, కాంట్రాక్టరు ఉన్నారు.

ఎంపీ టికెట్ కోసం ప్రయత్నాలు

- బీటీ నాయుడికి బయోడేటా అందజేసిన రాజశేఖర్



టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడికి బయోడేటా అందజేస్తున్న రాజశేఖర్

కర్నూలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బీసీ సామాజికవర్గానికి చెందిన నాయకుడిని బరిలో దింపాలని ఆ పార్టీ అధిష్టానం పరిశీలిస్తోంది. దీంతో బీసీల్లోని పలువురు తటస్థులు, నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. కురవ సామాజికవర్గానికి చెందిన పలువురు ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నారు. అందులో భాగంగా హైదరాబాద్‌లో ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ కంపెనీలో సీనియర్ ప్రాజెక్టు మేనేజరుగా పని చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ఎంకే రాజశేఖర్ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. పార్లమెంట్ నియోజవర్గం పరిధిలో నియోజకవర్గాల ఇన్‌చార్జిలను కలసి తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. బుధవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడును కలసి బయోడేటాను అందజేశారు. టీడీపీ అధినేత చంద్రబాబును కూడా ఇప్పటికే కలిసి ఎంపీ టికెట్ కోసం తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరినట్లు రాజశేఖర్ వెల్లడించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా 20 ఏళ్ల అనుభవం ఉందని, నార్త్ అమెరికా, యూరప్ దేశాల్లో పర్యటించానని, ప్రజా సేవలో మమేకమయ్యేందుకు ఎంపీగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఆయన తెలిపారు. బీసీలకు టీడీపీ ద్వారానే న్యాయం జరుగుతుందని రాజశేఖర్ పేర్కొన్నారు.

పెద్దపులి సంచారం



రుద్రవరం సమీపంలో పెద్దపులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

రుద్రవరం, జనవరి 24: నల్లమల అటవీ తీరంలోని రుద్రవరం సమీపంలో తెలుగు గంగ ప్రధాన కాల్వ గట్టుపై పెద్దపులి బుధవారం ఉదయం సంచరించింది. పంట పొలాలకు వెళ్లిన రైతులు పాదముద్రలను గుర్తించి ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్టు రేంజర్ శ్రీపతినాయుడు తన సిబ్బందితో వెళ్లి పాదముద్రలను పరిశీలించారు. అడవి నుంచి పెద్దపులి బయటికి వచ్చి తిరిగి అడవిలోకి వెళ్లిపోయిందని, ఎలాంటి భయాందోళన వద్దని రేంజర్ సూచించారు. ఆయన వెంట సెక్షన్ ఆఫీసరు నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడ్డ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

కౌతాళం, జనవరి 24: మండలంలోని వల్లూరు గ్రామం వద్ద తుంగభద్ర నది నుంచి కౌతాళం, కోసిగి మండలాలకు అక్రమ మద్యంను సరఫర చేస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు ద్విచక్రవాహనం, పడవ తెప్పను స్వాధీనం చేసుకున్నారు. కోసిగి సీఐ ప్రసాద్, ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోసిగి మండలం కడదొడ్డి గ్రామానికి చెందిన తోవి వినోద్ కుమార్, కౌతాళం మండలం బాపురం గ్రామానికి చెందిన రాగప్ప ద్విచక్రవాహనంతో పాటు నదిలో తెప్పలో 16 బాక్సుల(1536) కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. 16బాక్సుల కర్ణాటక మద్యంతో పాటు ద్విచక్రవాహనం, తెప్పను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ సోమ్లనాయక్, కానిస్టేబుళ్లు వీరాంజనేయులు, మద్దిలేటి, వీరేష్, రామచంద్ర, నారాయణ ఉన్నారు.

వైసీపీ పాలన చీకటిమయం

- 29న ఉమ్మడి కర్నూలులో షర్మిల పర్యటన
- డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహయాదవ్

ఆత్మకూరు, జనవరి 24: నాలుగున్నర ఏళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం చీకటిమయంగా మారిందని నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జె.లక్ష్మీ నరసింహ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆత్మకూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ నియంత పాలన సాగిస్తున్నాయని మండిపడ్డారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైసీపీ పట్ల ప్రజల్లో వ్యతిరేకత నెలకొందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపులకు కేవలం పదవులు కేటాయించి పెత్తనమంతా తమ వారి చేతుల్లోనే ఉంచుకుని సీఎం జగన్ బడుగులకు అన్యాయం చేశాడని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే 29న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలారెడ్డి కర్నూలుకు రానున్నారని తెలిపారు. ఈమె పర్యటనలో నంద్యాల, కర్నూలు జిల్లాల కాంగ్రెస్ ముఖ్యనేతలతో సమీక్షలు నిర్వహించి పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. షర్మిల పర్యటనను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మానపాటి శ్రీనివాసగౌడ్, ఇబ్రహీం, ఇస్మాయిల్, హబీబ్ ఖాన్, సురేంద్రారెడ్డి, ఇస్మాయిల్, నూర్‌బాషా, జావీద్, శివశంకర్, అబ్దుల్ రహిమాన్ ఉన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

చంద్రన్నతోనే రాష్ట్రం పురోభివృద్ధి : బుడ్డా

శ్రీశైలం, జనవరి 24: చంద్రన్నతోనే రాష్ట్రం పురోభివృద్ధి చెందుతుందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. బుధవారం శ్రీశైలంలోని మాణిక్యేశ్వరి కాలనీలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ క్యాక్రమాన్ని ఆయన నిర్వహించారు. క్యాక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అస్తవ్యస్తంగా మారిన రాష్ట్రపాలన గాడిలో పడాలంటే చంద్రబాబు తప్ప మరొకరు లేరని, చంద్రబాబు నాయుడు ముందుచూపుతో రాష్ట్రం పురోగతి చెందుతుందని స్పష్టం చేశారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ భారీ మెజారిటీతో గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీచేశారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర నాయకుడు జీవులా నాయక్, మండల నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు ఖాతా రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రామలింగారెడ్డి, బెంజిమెన్, రామయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా, కార్యకర్తలు

సెబ్ అధికారులతో ఏఎస్పీ సమీక్ష

నంద్యాల క్రైం, జనవరి 24 : జిల్లాలో నాటుసారా తయారీ, మద్యం అక్రమ రవాణాను నిర్మూలించేందుకు పూర్తిస్థాయిలో విధులు నిర్వర్తించాలని అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు సూచించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు బదిలీపై వచ్చిన సెబ్ అధికారులతో ఏఎస్పీ తన కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సెబ్‌స్టేషన్ల పరిధిలో కొత్తగా నాటుసారా ప్రభావిత ప్రాంతాలను గుర్తించి దాని నిర్మూలనకు కృషి చేయాలని ఆదేశించారు. ఇందుకోసం అవగాహన కార్యక్రమాలు, పరివర్తన 2.0 కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకం దార్లపై ప్రత్యేక నిఘా ఉంచి వారి ప్రవర్తనలో మార్పు వచ్చే విధంగా కృషి చేయాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే పీడీయాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా జిల్లాలో ఇతర ప్రాంతాలనుంచి వచ్చే అక్రమ మద్యం, జిల్లాలో అక్రమంగా మద్యం అమ్మకందార్లపై నిఘా ఉంచి ఇతర శాఖలతో సత్సంబంధాలు, సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఏఎస్పీ సెబ్ అధికారులకు సూచించారు.


సెబ్ అధికారులతో సమీక్షిస్తున్న అడిషనల్ ఎస్పీ

వైసీపీ, బీజేపీ చేతిలో ప్రజలు దగా : కాంగ్రెస్

నందికొట్కూరు జనవరి 24: కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను దగా, వంచన, మోసం చేస్తున్నాయని కాంగ్రెస్‌పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. బుధవారం నందికొట్కూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల దేశంలోని ప్రజలు మోసపోతున్నారని విమర్శించారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈ నెల 29న ఉమ్మడి కర్నూలు జిల్లాలో సమీక్షా సమావేశం నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. జగన్మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక బడుగు బలహీన వర్గాల సంక్షేమం అటకెక్కిందన్నారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను మైనార్టీ వర్గాల సంక్షేమ నిధులను దారి మళ్లించి ఆ వర్గాలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు రూ.20 వేల కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. ప్రతి నెలా జీతాలు ఆలస్యంగా ఇస్తున్నారని వివరించారు. సీపీఎస్‌పై జగన్మోహన్‌రెడ్డి మాటతప్పారన్నారు. ఇలాంటి ద్వంద వైఖరి ఉన్న వైసీపీ ప్రభుత్వానికి 2024 ఎన్నికల్లో తగిన విధంగా బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో నంద్యాల జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు నాగాలింగం, అశోకరత్నం, నందికొట్కూరు నియోజకవర్గం కో ఆర్డినేటర్ సభ్యులు పబ్బతి శ్రీరామ్, జిల్లా ప్రధానకార్యదర్శి సుంకన్న గౌడ్, మిడ్తూరు మండల అధ్యక్షులు రమేష్‌బాబు, కాంగ్రెస్ నాయకులు షేక్ ఇంతియాజ్ బాషా, సాదిక్ మియా, అశోక్, యేసురత్నం, సురేష్, రవి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ

అంగన్‌వాడీల ఉద్యమ స్ఫూర్తి అభినందనీయం

ఆత్మకూరు, జనవరి 24: అంగన్‌వాడీల ఉద్యమ స్ఫూర్తి అభినందనీయమని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, సురేంద్ర, స్వాము అన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు వారు మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ల కోసం 42 రోజులు పాటు అంగన్‌వాడీలు ఉద్యమించి తమ కోరికలను సాధించుకున్నారని అన్నారు. అంగన్‌వాడీల ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం అనేక విధాలుగా కుట్రలుపన్ని చివరికి అభాసుపాలైందని విమర్శించారు. ఎస్మా చట్టాన్ని ప్రయోగించినా, కలెక్టర్లు నోటీసులు జారీ చేసినా అంగన్‌వాడీలు వెనకడుగు వేయకుండా ఉద్యమాన్ని ఉధృతం చేశారని వివరించారు. అన్ని అడ్డంకులు సృష్టించిన అంగన్‌వాడీలు ఉద్యమ స్ఫూర్తిని చాటుకోవడం పట్ల వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

కౌలు రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


కౌలు రైతు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బుడ్డా

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం-2024 క్యాలెండర్‌ను బుధవారం శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆవిష్కరించారు. ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు సుధాకర్, నరసింహనాయక్, మాబాష, వీరన్న, రామ్‌నాయక్, రణధీర్, సురేంద్ర తదితరులు ఉన్నారు.

వేలం పాటలు వాయిదా

కొత్తపల్లి, జనవరి 24: కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి పుణ్యక్షేత్రంలో బుధవారం వివిధ దుకాణాలకు నిర్వహించాల్సిన వేలం పాటలు వాయిదా వేసినట్లు ఈవో మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర ప్రాంగణంలో ఒక ఏడాది పాటు హోటళ్లు, అమ్మవారి ఫొటోలు, కలింగడి పండ్లు, చెరుకు గడ్డలు విక్రయించుకునేందుకు వేలం పాటలు నిర్వహిస్తే ఏ ఒక్కరూ పాట పాడేందుకు ముందుకు రాలేదు. మళ్లీ ఎప్పుడు వేలం పాటలు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని ఈఓ పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం

ఆత్మకూరు రూరల్, జనవరి 24 : ప్రజలు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో మోహన్‌కుమార్ ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం వెంకటాపురం, కృష్ణాపురం గ్రామాల్లో మండల అధికారులతో కలిసి వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర పథకాలైన ఆయుష్మాన్ భారత్,ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన,పోషణ్ అభియాన్ అవగాహన కల్పించారు.

బీసీల ఫ్లెక్సీ తొలగింపు సమంజసం కాదు

పాములపాడు జనవరి 24 : ఈ నెల 18న పాములపాడులో చేపట్టిన బీసీల రథయాత్ర నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను రాజకీయ దురుద్దేశంతోనే తొలగించారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు మురళీమోహన్, మండల నాయకులు రామ్మోహన్, స్వాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద వారు నిరసన తెలిపారు. ఈ నెల 18వ తేదీన పాములపాడులో రథయాత్ర కార్యక్రమం ముగించక ముందే బస్టాండ్ ప్రాంతంలో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బీసీ సంఘం నాయకుల ఫోటోలతో ముద్రించిన ఫ్లెక్సీలను తొలగించడం రాజకీయ దురుద్దేశమేనని దుయ్యబట్టారు. తమకు సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రి తొలగించడం అన్యాయమన్నారు. ఫ్లెక్సీలు తొలగించిన వారిపైచర్యలు తీసుకోవాలని వారు కోరారు. మాల మహానాడు ఇల్లా ప్రధాన కార్యదర్శి అంకన్న, మైనారిటీ నాయకులు షేక్షావలి, సేవాభారతి అధ్యక్షుడు షర్ఫుద్దీన్, అలి, రమేష్, రామకృష్ణ ఉన్నారు.

కర్పూరి ఠాగూర్‌కు భారతరత్న ప్రకటించడంపై హర్షం

ఆత్మకూరు, జనవరి 24: బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్‌కు కేంద్ర ప్రభుత్వం 2024 సంవత్సరానికి సంబంధించి భారతరత్న ప్రకటించడం పట్ల ఆత్మకూరు నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శివ పాములేటి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆత్మకూరులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రెండుసార్లు బీహార్ సీఎంగా పనిచేసిన కర్పూరి ఠాగూర్ బడుగు బలహీన వర్గాల నేతగా గుర్తింపు పొందారని అన్నారు. ఈయన క్విట్ ఇండియా ఉద్యమాన్ని మొదలుకొని స్వాతంత్ర్య ఉద్యమాల్లో కూడా తనవంతు పాత్ర పోషించారని పేర్కొన్నారు. సంఘం నాయకులు పెద్దస్వాములు, గాలెన్న, అనిల్‌కుమార్, రుద్రప్రసాద్, బోధనం సుబ్బరాయుడు, జనార్ధన్, శేఖర్, రమణ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

ఆత్మకూరు రూరల్, జనవరి 24: ఆత్మకూరు మండలం సిద్ధాపురం చెరువు వద్ద కర్నూలు గుంటూరు రహదారిలో బుధవారం రాత్రి ఓ ట్రాక్టర్ బైక్‌ను ఢీకొనడంతో గుళ్ల నాగన్న అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ నారాయణ రెడ్డి తెలిపిన వివరాల మేరకు నాగలూటి గూడెంకు చెందిన నాగన్న బైక్‌పై ఆత్మకూరుకు వచ్చి తిరిగి స్వగ్రామం నాగలూటి గూడెంకు బైక్‌పై బయలు దేరాడు సిద్ధాపురం చెరువు కట్ట ప్రాంతంలో భైర్లూటి గూడెంలోని వ్యవసాయ పనులు ముగించుకొని అదే రోడ్డుపై ఎస్‌ఎన్ తండాకు వెళుతున్న ఓ ట్రాక్టర్ బైక్‌ను ఢీ కొంది. బైక్‌నుంచి కింద పడడంతో గుళ్ల నాగన్నకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108లో ఆ యువకుడిని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అతన్ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

చిన్నారుల పడిగాపులు

- సెంటర్ల తాళాలు అందజేయని సచివాలయం సిబ్బంది
- ఒంటిగంట దాటినా తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు

పాములపాడు, జనవరి 24 : మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద చిన్నారులు పడిగాపులు కాచారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయమైనా ఆయా కేంద్రాల తాళాలు తెరుచుకోలేదు. అక్కడే అంగన్‌వాడీ ఆయాలు, టీచర్లు పిల్లలతోపాటు వరండాలో కూర్చొని సచివాలయ సిబ్బంది కోసం పడిగాపులు కాచారు. సమ్మె విరమించి విధులకు హాజరయ్యేందుకు వచ్చిన అంగన్వాడీ వర్కర్లకు చాలా ప్రాంతాల్లో ఆలస్యంగా, మరికొన్ని చోట్ల ఒంటగంట దాటినా తాళాలు ఇవ్వకుండా ఉండడంతో ఎండలో ఉండి పోయారు. బానకచెర్ల, గుండాలనట్టు, వేంపెంట, పాములపాడు 1 సెంటర్లు మధ్యాహ్నం వరకు తెరచుకోలేదు. త్వరగా రండి అని ఫోన్‌చేస్తే 'రావడం లేటవుతుంది, లేదంటే సెంటరు తాళాలు పగులగొట్టుకోండి' అంటూ బానకచెర్లలో సచివాలయ సిబ్బంది సమాధానం చెప్పారని అంగన్‌వాడీలు తెలిపారు. మరొకచోట 'మీ జాయినింగు ఆర్డర్లు చూపించాలంటూ' ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పౌష్టికాహార నిల్వలు సరిగా లేవని అంగన్వాడీలు ఆందోళన చెందుతున్నారు. వీటిపై సూపర్‌వైజర్‌లకు ఫిర్యాదు చేయడంతో సిబ్బంది వచ్చి సెంటర్లను స్వాధీన పర్చేవరకూ ఎంత సమయమైనా వేచి ఉండాలని చెప్పడంతో అంగన్వాడీ వర్కర్లు చేసేదేమీ లేక మిన్నకుండిపోయారు. చిన్నారులు కేంద్రాల బయట ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సచివాలయ సిబ్బంది అంగన్వాడీలను ఇబ్బందులు పెట్టడం మంచిదికాదని స్థానికులు వాపోయారు.


గుండాలనట్టు అంగన్‌వాడీ సెంటర్ వద్ద వేచిఉన్న చిన్నారులు, సిబ్బంది

ఓటు వినియోగంపై అవగాహన

బండిఆత్మకూరు, జనవరి 24 : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎలక్ట్రానిక్ యంత్రాల ద్వారా (ఈవీఎం) ఓటు వినియోగంపై ప్రజలకు అవగాహన సమావేశాలు ప్రారంభం అయ్యాయి. బుధవారం మండలంలోని పెద్దదేవళాపురం, భోజనం, పరమటూరు, సంతజూటూరు గ్రామాల్లో ప్రజలకు ఈవీఎం ద్వారా ఓటు ఎలా వినియోగించుకోవాలి ప్రజలకు చూపించారు. ఈ అవగహ కార్యక్రమాలు నేటి నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు కొనసాగుతాయని అధికారి ఈశ్వర్ తెలిపారు. ఆయా గ్రామాల వీఆర్వోలు రామచంద్రుడు, నాగేశ్వరరావు, సుంకన్న, ఈఏ ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాలో తప్పిన ప్రమాదం

నందికొట్కూరు, జనవరి 24: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రమాదం తప్పింది. బుధవారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడిన అనంతరం క్రికెట్ పోటీలను ప్రారంభించేందుకు శాప్‌ఛైర్మన్, నాయకులు స్టేజ్ మీది నుంచి మైదానంలోకి వెళ్లారు. వెళ్లిన ఐదు నిమిషాల్లోపే పెనుగాలి వీయడంతో స్టేజ్ పైకిలేచింది. దీంతో స్టేజ్‌పై ఉన్న పీఈటీలు, అక్కడే ఉన్న కొందరు క్రీడాకారులు ఇనుప కడ్డీలను పట్టుకుని స్టేజ్‌ను పునర్ నిర్మించారు. ఈ సమయంలో స్టేజ్‌పై ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

వినియోగదారులను మోసగిస్తున్న 'డార్క్ పార్టన్స్'


సదస్సులో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్

పాణ్యం, జనవరి 24 : వినియోగదారులను డార్క్‌పార్టన్స్ మోసపుచ్చుతూ, గందరగోళానికి గురిచేస్తున్నాయని హైదరాబాదు బ్రెయిలోవిజన్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ రిసోర్స్ పర్సన్ పవన్ కుమార్ అన్నారు. మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో డార్క్‌పార్టన్స్ అంశంపై రెండురోజుల అవగాహన సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డార్క్‌పార్టన్స్ వినియోగదారులను గందరగోళానికి గురి చేసి మోసగిస్తోందన్నారు. వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్‌లలో సహ వివిధ డిజిటల్ ఇంటర్ నెట్‌లో డార్క్‌పార్టన్స్ కనిపిస్తాయన్నారు. ఈడార్క్ పార్టన్స్ లను అరికట్టే పద్ధతులను విద్యార్థులకు వివరించారు. డాక్టర్ షర్మిలాదేవి, హెచ్ఓడీ డాక్టర్ ఫరూక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

26న రైతుల ట్రాక్టర్, బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

మహానంది, జనవరి 24: ఈ నెల 26వ తేదీన నంద్యాలలోనినూనెపల్లె ఓవర్‌బ్రిడ్జి నుండి పద్మావతీ నగర్ వరకు జరుగు ట్రాక్టర్, బైక్ ర్యాలీలో రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పాల్గొని జయప్రదరం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు కోరారు. నంద్యాల జిల్లా కేంద్రంలో జరుగుతున్న ర్యాలీలో జిల్లాలోని రైతులు కూలీలు కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మహానందిలో సెబ్ దాడులు

మహానంది, జనవరి 24: మహానంది మండలంలో బుధవారం సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. బొల్లవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుంచి పరిమితికి మించి మద్యం బాటిళ్లు దొరికినట్లు సెబ్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రస్తుతం దాడులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సారా, మద్యం అక్రమ రవాణా, బెల్టు షాపు నిర్వహకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి : ఎమ్మెల్యే

పాణ్యం, జనవరి 24 : ఎన్నికలకు ముందే అభివృద్ధి పనులు పూర్తి చేయాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ దస్తగిరి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజలకుఇచ్చిన హామీలు నెరవేర్చడానికి సహకరించాలని కోరారు. ఎంపీపీ ఉశేన్‌బీ, తహశీల్దారు శ్రీనివాసులు గౌడ్, జెడ్పీటీసి సరళమ్మ, ఎంపీటీసిలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ


పీడీ శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల నూనెపల్లె, జనవరి 24 : వీఓఏల సమస్యల పరిష్కారానికై ఈ నెల 30, 31తేదీల్లో తలపెట్టిన చలో విజయవాడ వంటావార్పు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, బాలవెంకట్ పిలుపునిచ్చారు. చలో విజయవాడకు అనుమతించాలని కోరుతూ పీడీ శ్రీధర్‌రెడ్డికి సీఐటీయూ నాయకులు, వీఓఏలు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వీఓఏల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, రూ.10లక్షల గ్రూప్‌ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వీఓల మెర్జ్‌వల్ల ఉపాధి కోల్పోయిన వీఓఏలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పొదుపు సంఘాలకు రూ.5లక్షలకు వడ్డీ రాయితీ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్, తిరుపతయ్య, సోమన్న, శంకరయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి


నంద్యాలలోని బొమ్మలసత్రం సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

నంద్యాల నూనెపల్లె, జనవరి 24 : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థను ప్రభుత్వ రంగ సంస్థగా గుర్తించి అందులో పనిచేసే ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆ సంస్థ జేఏసీ చైర్మన్ పుల్లయ్య, కన్వీనర్లు రవికుమార్, కృష్ణారెడ్డిలు డిమాండ్ చేశారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నంద్యాలలోని బొమ్మలసత్రం సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. సంస్థను ప్రభుత్వ రంగ సంస్థగా గుర్తించి కేడర్ ఫిక్సేషన్, పే ఫిక్సేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ వయస్సును 60నుంచి 62సంవత్సరాలకు పెంచాలని, కారుణ్య నియామకాలు చేపట్టి ఉద్యోగాలు కల్పించాలని, ఈపీఎఫ్ వందశాతం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారానికి పురుగులు..!

గోస్పాడు, జనవరి 24: ప్రభుత్వం బాలింతలకు, చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అందించే పౌష్టికాహారానికి పురుగులు పట్టడంతో హెల్పర్లు వాటిని కాల్చి వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని 40 రోజుల పాటు నిరవధిక దీక్ష చేశారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న పాలు, కంది బ్యాళ్లు, ఇతర పౌష్టికాహార పదార్థాలకు పురుగులు పట్టడంతో వాటిని శుభ్రం చేసి దూరంగా తీసుకెళ్లి కాల్చి వేశారు.

గ్రామంలో తగ్గిన నీరు


సుబ్బరాయుని కొత్తూరులో తగ్గిన నీరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాణ్యం, జనవరి 24 : మండలంలోని సుబ్బరాయుని కొత్తూరులో చేరిన ఎస్సార్బీసీ నీటిని అధికారులు చర్యలు చేపట్టి కాల్వలద్వారా వెళ్లేలా చర్యలు చేపట్టారు. దీంతో గ్రామంలో నీరు తగ్గి జనజీవ నానికి ఆటంకాలు తొలగాయి. ఈనెల 2న గ్రామాన్ని చుట్టుముట్టిన ఎస్సార్బీసీ నీరు అన్న వార్తకు స్పందించిన అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో బుధవారం నీరు తగ్గుముఖం పట్టాయి. గ్రామ సచివాలయం, దేవాలయాలకు వెళ్లే భక్తుల ఇబ్బందులు తొలగాయని స్థానికులు తెలిపారు.

రబీ పంటలకు ఈకేవైసీ చేయించుకోవాలి

గోస్పాడు, జనవరి 24: రైతులు రబీ పంటలకు ఈకేవైసీని చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని జూలేపల్లె, పసురుపాడు, నెహ్రూనగర్ గ్రామాలలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను ఆయన పరిశీలించి పంట నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రబీలో వేసి పంటలకు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని, రైతు భరోసా కేంద్రాలలో వీఏఏలు ఎప్పుడు అందుబాటులో ఉంటారని అన్నారు. ఈనెల చివరిలోగా ఈకేవైసీ చేయించుకోవాలని అన్నారు. జొన్న కొనుగోలు, పంట బీమా, ఇతర ప్రతి పథకానికి ఈ-పంట నమోదు అవసరమని అన్నారు. మద్దతు ధరతో జొన్న కొనుగోలుకు సంబంధించి రైతులు రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు స్వప్నిక, ఏఈవోలు కీర్తి, రామకృష్ణ, వీఏఏలు సుభాష్, అయూబ్ బాష పాల్గొన్నారు.

ఉపయోగంలో లేని చెక్కు పుస్తకాల దహనం


ఉప ఖజానా కార్యాలయ సిబ్బందితో సమావేశమైన జేసీ

నంద్యాల క్రైం, జనవరి 24 : నంద్యాల జిల్లా పరిధిలోని 8 ఉప ఖజానా కార్యాలయాలు, జిల్లా ఖజానా కార్యాలయానికి సంబంధించి ఉపయోగంలో లేని 2,132 చెక్కు పుస్తకాలను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా ఖజానా కార్యాలయ ఆవరణలో పంచనామా నిర్వహించి దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఖజానా అధికారిణి ఎం.లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ జీవో నెంబరు 135 ప్రకారం చాలాకాలంగా ఉపయోగంలో లేని పలు రకాల స్టాంపులు, చెక్కులు దహనం చేయమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఆ ఆదేశాల మేరకు జేసీ ఆధ్వర్యంలో పదిమంది జిల్లా స్థాయి అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసిందని, కమిటీ ఆధ్వర్యంలోనే పంచనామా నిర్వహించి దహనం చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నంద్యాల జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, జెడ్పీ సీఈవో, జిల్లా రిజిస్ట్రార్, జిల్లా పంచాయతీ అధికారి, జ్యుడీషియల్ సిబ్బంది, జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, జిల్లా ఖజానా కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులు నైపుణ్యాన్ని చాటుకోవాలి

ఆత్మకూరు, జనవరి 24: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీల్లో క్రీడాకారులు తమ క్రీడానైపుణ్యాన్ని చాటుకోవాలని ఆత్మకూరు ఆర్డీవో మిరియాల దాసు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర పోటీలను వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో దాగివున్న క్రీడా ప్రతిభను గుర్తించేందుకే ప్రభుత్వం ఆడుదం ఆంధ్ర పేరిట క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రాణించే వారికి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో కూడా పాల్గొనే అవకాశం వుంటుందని వివరించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మోహన్‌కుమార్, ఎంఈవో జానకీరామ్, పీఈటీలు దేవానంద్, శంకర్, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

ప్రమాద రహితంగా డ్రైవర్లు విధులు నిర్వహించాలి


డ్రైవర్లను సత్కరిస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు

ఆత్మకూరు, జనవరి 24: ప్రమాదరహితంగా ఆర్టీసీ డ్రైవర్లు విధులు నిర్వర్తించాలని ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు అన్నారు. బుధవారం రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక డిపో పరిధిలో ప్రమాదరహితంగా విధులు నిర్వర్తించిన ఎం.బాష, బీఎండీ రఫీక్, అహ్మద్ డ్రైవర్లను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీ సంస్థ శ్రేయసత్కరం అనే విషయం ప్రయాణికుల్లో వుందని అన్నారు. ప్రయాణికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆర్టీసీ డ్రైవర్లు ప్రమాదరహితంగా విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ప్రత్యేకించి బడిపిల్లలను, ఉద్యోగులను తమ క్షేత్రంగా వారి గమ్యస్థానాలను చేర్చడంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర ఎంతో వుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ నాయక్, ట్రాఫిక్, డిప్యూటీ సూపరిన్‌డెంట్ ఎంఎండీ. బాష, ఎస్‌డీఐ షఫివుల్లా తదితరులు ఉన్నారు.

'దారి'కొచ్చేనా..?


జీసీపాలెం, శింగవరం గ్రామాల మధ్య గుంతలు పడిన రోడ్డు


నరకయాతనగా కంకర తేలిన ఎర్రగుంట్ల రోడ్డు

బండి ఆత్మకూరు, జనవరి 24 : మండలంలోని పలు గ్రామాల రహదారులు అధ్వాన్నంగా మారాయి. నాలుగున్నర ఏళ్లుగా ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. జీసీపాలెం - శింగవరం, బండిఆత్మకూరు - ఎర్రగుంట్ల, సంతజూటూరు - లింగాపురం, బండిఆత్మకూరు - ఓంకారం గ్రామాల రహదారులపై ప్రయాణించాలంటేనే భయమేస్తోందనిస్థానికులు బెంబెలెత్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు అవుతున్నా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పల్లెల రోడ్లను పట్టించుకున్న పాపానపోలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారుల మరమ్మతులు ఎప్పుడు చేపడతారోనని ఆశగా ఎదురు చూస్తున్నారు.

డ్వాక్రా మహిళలకు వైసీపీ అన్యాయం

● టీడీపీ నాయకుల ధ్వజం



మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన బనగానపల్లె బీసీ కాలనీ యువకులు



రుద్రవరం: నరసాపురంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిన ప్రజలు



డోన్‌లో మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సుబ్బారెడ్డి

బనగానపల్లె, జనవరి 24: నా అక్కా చెల్లెళ్లు అంటూ మహిళల మాంగళ్యాలు తెంచిన దుర్మార్గుడు సీఎం జగన్ అని, డ్వాక్రా మహిళలకు అన్యాయం చేశారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి మండిపడ్డారు. మండలంలోని యర్రగుడి, గోవిందిన్నె గ్రామాల్లో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ మాట్లాడుతూ కోటి 14 లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉంటే, ఆసరా పథకాన్ని కేవలం 79 లక్షల మందికే కుదించారని ధ్వజమెత్తారు. 35 లక్షల పొదుపు మహిళలకు ఆసారా ఇవ్వకుండా మొండిచేయి చూపారన్నారు. సీఎం జగన్ రూ.2 లక్షల కోట్ల విలువైన నాసిరకం మద్యం అమ్మి ప్రజల ఆరోగ్యాన్ని గుల్లచేశారని ఆరోపించారు. వేల మంది కల్తీ మద్యం తాగి మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం రేట్లు పెంచి మద్యం ప్రియుల నుంచి డబ్బులు దోచేస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనలో సున్నా వడ్డీ రూ.5లక్షలకు వర్తింపచేస్తే సీఎం జగన్ రూ.3లక్షలకు కోత కోసి మోసం చేశారని అన్నారు. రూ.3 లక్షలకు కూడా సున్నా వడ్డీ కేంద్రమే భరిస్తోందన్నారు. యర్రగుడి గోవిందిన్నె గ్రామాల్లో 2014నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. అలాగే అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● బనగానపల్లె పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన 30 కుటుంబాలకు చెందిన యూత్ సభ్యులు టీడీపీలో చేరారు. బుధవారం టీడీపీ కార్యాలయం ఆవరణలో బీసీ యువకులకు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ కాలనీకి చెందిన అంబాపురం ధననుంజయ ఆధ్వర్యంలో వీరు టీడీపీలో చేరారు. బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తేనే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

రుద్రవరం: చంద్రబాబు నాయకత్వం వైపు రాష్ట్ర ప్రజల చూపు మళ్లిందని మాజీమంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని నరసాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మాజీమంత్రి ఇంటింటికీ తిరిగి మేనిఫెస్టో పత్రాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, మంత్రులు దోచుకోవడం, దాచుకోవడం మినహా ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. చంటి, ఖాశీం, నాగార్జున, ఈశ్వరయ్య, మబ్బు పెద్దన్న, శ్రీను, శేషు, వరాలు, సుబ్బరాయుడు, మరో 20 కుటుంబాలు మాజీమంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరాయి. వారికి మాజీమంత్రి కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.

● పత్తికొండలో ఈ నెల 28న చంద్రబాబు సభ జరుగుతుందని, విజయవంతం చేయాలని మాజీమంత్రి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. ఆలమూరు బాచిపల్లె వెంకటనారాయణ, సర్పంచ్ గుర్రం శాంతకుమారి, శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ బలరామిరెడ్డి, పార్థసారధి రెడ్డి, పక్కీరా, పక్కీరయ్యగౌడ్, పుల్లారెడ్డి, నంద్యాల పార్లమెంటు ఎస్సీ సెల్ కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, అల్లాడి చంద్రశేఖర్, సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

డోన్: డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని సీఎం జగన్ చివరకు పొదుపు మహిళలకు అన్యాయం చేశారని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి విమర్శించారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో కోటి మంది పొదుపు మహిళలు ఒక్కొక్కరు రూ.20 వేలు లబ్ధి పొందారని, అయితే వైసీపీ పాలనలో ఒక్కొక్క మహిళ రూ.15 వేలే లబ్ది పొందారని చెప్పారు. రాష్ట్రంలో కోటి 14 లక్షల మంది డ్వాక్రా మహిళలుంటే కేవలం 79 లక్షల మందికి మాత్రమే అందించారని, 35 లక్షల మంది పొదుపు మహిళలకు మోసం చేశారని ధ్వజమెత్తారు. ఉచితంగా ఇల్లు నిర్మించి ఇస్తానని నమ్మించి మాట తప్పి ఓటీఎస్ పేరుతో మహిళ లబ్ధిదారులు ఒక్కొక్కరి నుంచి రూ.10వేల నుంచి 30వేల వరకు వసూళ్లు చేయడం అన్యాయమన్నారు. సెంటు స్థలం పట్టా ఇచ్చి జగనన్న ఇళ్ల నిర్మాణం పేరుతో మహిళలను అప్పులపాలు చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. వైసీపీకి బుద్ధి చెప్పి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారన్నారు.

● టీడీపీ అధినేత చంద్రబాబుతోనే ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 24వ వార్డులో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిత్యావసర ధరలు పెరిగి సామాన్యులు ఏమీ కొనలేని దుస్థితి నెలకొందన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, ఆలా మల్లికార్జున రెడ్డి, అజీజ్, అభిరెడ్డిపల్లె గోవిందు, ఎస్ఎండీ రఫీ, చక్రపాణిగౌడు, మధు, ఉపేంద్ర, పాల్ రాజు, సిటికేబుల్ కిరణ్, ఉశేన్ పీరా, హనుమంతరెడ్డి, కోనేటి కాశీ విశ్వనాథ్, చిన్నకాంత్, నీలం ప్రభాకర్ యాదవ్ పాల్గొన్నారు.

'సీఎం జగన్ బీసీల ద్రోహి'



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కోవెలకుంట్ల, జనవరి 24: బీసీల ద్రోహి సీఎం జగన్ అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వలస రామకృష్ణుడు, గడ్డం రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ మా ఎస్సీ బీసీలు, ఎస్టీలు అని చెప్పే జగన్ కార్పోరేషన్‌లు ఏర్పాటు చేశారని అందుకు వారికి రుణాలు ఇచ్చేందుకు ఒక్క నయాపైసా జమ చేయకుండా తీరని అన్యాయం చేశారన్నారు. టీడీపీ హయాంలో బీసీలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి 50 శాతం రుణాలిచ్చి బీసీలను అభివృద్ధి చసిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు.సీఎం జగన్ ముఖ్యమంత్రి అయ్యాక స్థానిక సంస్థల ఎన్నికల్లో 34శాతం నుంచి 24 శాతానికి తగ్గించి బీసీలను అణగదొక్కారన్నారు. ఒక్క చాన్సు అంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ బీసీలను అభివృద్ధి చేయకుండా బీసీలను హత్యలు చేసి అణగదొక్కారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమడాల మద్దిలేటి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, లింగాలనాయుడు, బుచ్చెన్న, రాజేశ్వరియాదవ్, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, బిజనవేముల హుసేనయ్య, బాలరాజు, గడ్డంనాగార్జునరెడ్డి, బిజనవేముల హుసేనయ్య, ధనుంజయుడు, తదితర బీసీ నాయకులు, పాల్గొన్నారు.

'శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు'



డోన్‌లో కవాతు నిర్వహిస్తున్న పట్టణ పోలీసులు

డోన్(రూరల్), జనవరి 24: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. బుధవారం తెల్లవారుజామున పట్టణంలోని ప్రధాన వీదుల్లో పోలీసుల కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి'



టంగుటూరులో వ్యవసాయ సాంకేతిక ప్రదర్శనను తిలకిస్తున్న రైతులు

బనగానపల్లె, జనవరి 24: మండలంలోని టంగుటూరులో యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వ్యవసాయ సాంకేతిక ప్రదర్శన, రైతు సదస్సును నిర్వహించారు. విద్యార్థులు ముత్యాల సాగు, డ్రోన్ పిచికారీ, నీటి సంరక్షణ, సేంద్రీయ వ్యవసాయం, పట్టుపురుగుల పెంపకం, సమగ్ర వ్యవసాయ విధానం, తేనెటీగల పెంపకం, మిద్దె తోటల పెంపకం, అధునాతన సాంకేతికతపై నమూనాలు రూపొందించి రైతులకు వివరించారు. కేవీకే శాస్త్రవేత్త రమణయ్య మాట్లాడుతూ గ్రామీణ వ్యవసాయం, రైతుల స్థితిగతులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాల న్నారు. వీటి ఆధారంగతా భవిష్యత్తు వ్యవసాయ పరిశోధనలు చేయాల న్నారు. రైతులు భూసార ఆధార ఎరువులు వినియోగించి నేల సారవంతం పెంచుకోవాలని సూచించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని, పురుగల మందు వాడకం తగ్గించాలని సూచించారు. సేంద్రీయ ఎరువులు వాడుకొని ఖర్చు తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. ఏఓ సురేశ్ కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్, బాలరాజు, రవిగౌడ్, మల్లారెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులు, టంగుటూరు రైతులు పాల్గొన్నారు.

వాహనాల పరిశీలన

రుద్రవరం, జనవరి 24: ఎర్రచందనం కేసుల్లో పట్టుబడిన వాహనాలను వెహికల్ ఇన్‌స్పెక్టరు రవిశంకర్ నాయక్ బుధవారం పరిశీలించారు. మోటారు సైకిళ్లు, ఆటోలు, ఇతర వాహనాలను పరిశీలించి ఫారెస్టు అధికారులకు నివేదికను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రేంజర్ శ్రీపతినాయుడు, సెక్షన్ ఆఫీసరు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థిని హసినిని అభినందిస్తున్న అధ్యాపకులు

బనగానపల్లె, జనవరి 24: బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న దూదేకుల హసిని జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. దీంతో విద్యార్థినిని ప్రిన్సిపాల్ సాలేహబేగం, అధ్యాపకులు బుధవారం అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హసిని గత నెలలో జైపూర్‌లో జరిగిన అండర్-17 జాతీయ పోటీలకు ఎంపికై అక్కడ మంచి ప్రతిభ కనబరచినట్లు తెలిపారు. మరోసారి ఎంపిక కావడంతో విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



చిన్నకంబలూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

రుద్రవరం, జనవరి 24: మండలంలోని పెద్దకంబలూరు, గోనంపల్లె, చిన్నకంబలూరు, యల్లావత్తుల, బీరవోలు గ్రామాల్లో ఈవీఎంలో ఓటు హక్కు వినియోగంపై అధికారి నరసింహ అవగాహన కల్పించారు. ఓటు హక్కు ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. ఓటు వేశాక ఎవరికి ఏ గుర్తుకు పడిందని ఎలా తెలుసుకోవాలన్న అంశాలపై వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ అవగాహన కల్పించినట్లు తెలిపారు. వీఆర్వోలు మల్లేశప్ప, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.

పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

చాగలమర్రి, జనవరి 24: చాగలమర్రి గ్రామంలోని సంతమార్కెట్ సమీపంలోగల ఉర్దూ పాఠశాలను ఎంఈవో న్యామతుల్ల బుధవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యతగల భోజనం పంపిణీ చేయాలని, మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని సూచించారు. అనంతరం ఎఫ్-3 పరీక్షలు రాస్తున్న విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. హెచ్ఎం మాబుహుసేన్, సీఆర్పీ అమీర్‌ఖాన్ ఉన్నారు.

'రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, జనవరి 24: విద్యార్థులు రోడ్డు ప్రమాదాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని టోల్ ప్లాజా సేఫ్టీ మేనేజర్ ఖాదర్‌వలి సూచించారు. బుధవారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కోటయ్య ఆధ్వర్యంలో 35వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఖాదర్‌వలి మాట్లాడుతూ రహదారి నియమాలు పాటించాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని, రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు 108, 1033 నంబర్‌లకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం టోల్‌ప్లాజా, పారామెడికల్ అధికారి అబ్దుల్‌కలామ్ మాట్లాడుతూ ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన ప్రథమ చికిత్సల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు బహుమతులను అందజేశారు. టోల్‌ప్లాజా హెడ్ మదన్‌మోహన్, టోల్‌ప్లాజా మేనేజర్ పరదిప్‌మాలిక్, మేనేజర్ యాకుబ్, రూట్ ఆఫీర్ కుతుబుద్దీన్, ఆర్‌పీవో సుభాష్, ఉపాధ్యాయులు, పీడీ దాదాపీర్, టోల్‌ప్లాజా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్రపై అవగాహన

చాగలమర్రి, జనవరి 24: మండలంలోని చిన్నబోదనం, పెద్దబోదనం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఆయా శాఖల అధికారుల సమక్షంలో బుధవారం అవగాహన కల్పించారు. ఏవో రంగనేతాజీ పీఎం కిసాన్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. గ్రామాల్లో డ్రోన్ ద్వారా ప్రజలకు కేంద్ర సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రమాద బీమా, సుకన్య సంవృద్ధి, బాలికల బంగారు భవితవ్యం గురించి వివరించారు. 26వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో సంకల్ప యాత్ర కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ, ఆయా శాఖల అధికారులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నోటీసులు జారీ

ఆళ్లగడ్డ, జనవరి 24: ఆళ్లగడ్డ పట్టణంలో అక్రమ లే అవుట్లపై కుడా అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కుడా వైస్ ఛైర్మన్ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో 5 అక్రమ లే అవుట్లను గుర్తించామని, వినియోగదారులు కుడా అనుమతి లేని ప్లాట్లను కొనుగోలు చేయవద్దని సూచించారు. అక్రమ లే అవుట్ల యజమానులకు నోటిసులు జారీ చేశామని, అక్రమ లే అవుట్లలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టరాదని సూచించామన్నారు. ఆయన వెంట ప్లానింగ్ అధికారులు సంధ్య, విజయ భాస్కర్ తదితరులు ఉన్నారు.

వెదురు కర్రల పట్టివేత

రుద్రవరం, జనవరి 24: రుద్రవరం అటవీ రేంజ్ పరిధిలో వెదురుకర్రలు పట్టుబడినట్లు బుధవారం సెక్షన్ ఆఫీసరు నాగరాజు తెలిపారు. ఈ వెదురు కర్రలు అటవీ సమీపంలో అక్రమంగా నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో ఆ ప్రాంతంపై దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ కర్రలను రుద్రవరం కలప డిపోకు తరలించారు. అప్పనపల్లె పైభాగాన చెలిమ, రుద్రవరం రేంజ్‌ల సరిహద్దుల్లో పట్టుబడ్డాయని తెలిపారు.

యువత రక్తదానం



రక్తదానం చేస్తున్న బేతంచెర్ల తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి

బేతంచెర్ల, జనవరి 24: బేతంచెర్ల-కర్నూలు రహదారిలో ఉన్న ఓ పెట్రోల్ బంకు యజమాని మల్లు విఘ్నేశ్వరరెడ్డి బృందం ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 50 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి కూడా 7వ సారి రక్తదానం చేశారు. రక్తదాన సేవ కార్యక్రమానికి సహకరించిన పెట్రోల్ బంకు, ఇండియన్ రెడ్‌క్రాస్ సిబ్బందికి, పట్టణ పెద్దలకు లైఫ్ యువనేత్ర సేవా సమితి తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

పన్ను వసూలు చేయాలి: డీఎల్‌పీవో

రుద్రవరం, జనవరి 24: రుద్రవరం పంచాయతీ పరిధిలో దుకాణాల పన్ను గత మూడేళ్ల నుంచి వసూలు చేయలేదని, వసూలు చేయాలని డీఎల్‌పీవో రాంబాబు సూచించారు. బుధవారం రుద్రవరం కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దుకాణాలకు పన్ను రేటు నిర్ణయించి వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నిర్లక్ష్యం చేసి వదిలేస్తే ఎలా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఈవో చెన్నయ్య పాల్గొన్నారు.

'పంచాయతీ నిధులు కాజేయడం హేయం'

శిరివెళ్ల, జనవరి 24: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల నిధులను వైసీపీ ప్రభుత్వం దొంగ దారిలో కాజేయడం హేయనీయమని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, సర్పంచ్‌ల సంఘంల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 3న నిర్వహించిన రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం సదస్సు విజయవంతమైందని అన్నారు. ఇందుకు ఎంతగానో కృషి చేసిన శిరివెళ్ల మండలం మోత్కులపల్లె గ్రామ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డిని పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీ బాబు రాజేంద్ర ప్రసాద్ , రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు లక్ష్మీ ముత్యాలరావు విజయవాడలో శాలువా, పూలమాలలతో బుధవారం సన్మానించారు.

విజ్ఞానయాత్రకు విద్యార్థులు

చాగలమర్రి, జనవరి 24: చాగలమర్రి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు బుధవారం విజ్ఞాన యాత్రకు తరలివెళ్లారు. ప్రొద్దుటూరులోని రాజరాజేశ్వరి ఇన్‌స్టూట్‌ఆఫ్ టెక్నాలజీ ఒకేషనల్ ఇండస్ట్రియల్‌ను సందర్శించారు. 150 మంది విద్యార్థులు వృత్యాంత్తర శిక్షణకు సంబంధించిన విషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలయ్య, మధురిమ, షఫిరూన్, నరేష్, మల్లికార్జున, భవాని తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన

చాగలమర్రి, జనవరి 24: మండలంలోని మల్లేవేముల గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించి వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు డా.అంజలి సూచించారు. ఇంటింటికి వెళ్లి రక్తపూత పరీక్షలు చేశారు. మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈదుల సరోజమ్మ, సూపర్‌వైజర్ సీతారాములు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక సాయం



పేదలకు చెక్కులు పంపిణీ చేస్తున్న టంగుటూరు శీనయ్య

బనగానపల్లె, జనవరి 24: మండలంలోని పలువురు పేదలకు వసుధా ఫౌండేషన్ ద్వారా బుధవారం ఆర్థిక సాయం అందించినట్లు కోఆర్డినేటర్ టంగుటూరు శీనయ్య తెలిపారు. రూ.37వేలు విలువగల చెక్కులు అనారోగ్యంతో బాధపడుతున్న వివిధ కుటుంబీకులకు రూ.37 విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. టంగుటూరు శీనయ్య మాట్లాడుతూ వసుధా ఫౌండేషన్ ద్వారా పేదలకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో కూడా విద్యార్థులకు నోటుపుస్తకాలు, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించినట్ల ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆకుమళ్ల పక్కీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'కులగణన సర్వే పకడ్బందీగా చేపట్టాలి'



రుద్రవరం: కులగణన సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో

చాగలమర్రి, జనవరి 24: మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న కులగణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో మహబూబ్ దౌలా సూచించారు. బుధవారం చాగలమర్రి గ్రామంలో కులగణన సర్వేను పరిశీలించారు. కులగణనపై కార్యదర్శులకు, వలంటీర్లకు, సచివాలయ ఉద్యోగులకు సూచనలు, సలహాలు అందజేశారు.

రుద్రవరం: కులగణన సర్వే సక్రమంగా చేయాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి సూచించారు. మండలంలోని నరసాపురం, టి.లింగందిన్నె, రుద్రవరం, నాగలవరంలో సర్వేను పరిశీలించారు.

నేడు కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

డోన్(రూరల్), జనవరి 24: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ లోక్‌సభ ప్రధాన కార్యదర్శి, డోన్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి అన్నారు. బుధవారం రాత్రి ఆయన మాట్లాడుతూ డోన్‌లో జరిగే నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశానికి జిల్లా డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ హాజరవుతారని, కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో కాంగ్రెస్ లోక్‌సభ కార్యదర్శి జనార్దన్ యాదవ్, నాయకులు శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటపై అడవి పందుల దాడి



ధ్వంసమైన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం, జనవరి 24: మండలంలోని వెలగలపల్లె రెవెన్యూ పరిధిలో మొక్కజొన్న పంటపై అడవి పందులు దాడి చేశాయని రైతులు అటవీశాఖ, వ్యవసాయశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం వారి ఫిర్యాదు మేరకు అడవి పందుల దాడిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను రెండు శాఖల అధికారులు పరిశీలించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. మొక్కజొన్న పంట పొలాల చుట్టూ కరెంటు తీగలు కానీ, ఉచ్చులు కానీ వేయవద్దని, వన్యప్రాణులకు ప్రాణ హాని కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంటలకు నష్టం జరిగితే పరిహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు నాగరాజు, వీహెచ్ఏ ఫణికుమార్ తదితరులు ఉన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

బేతంచెర్ల, జనవరి 24: డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్ల-డోన్, డోన్-ప్యాపిలి మండలాల ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన తాగునీరు అందించేందుకు వాటర్‌గ్రిడ్ పథకం కింద రూ.350 కోట్లతో పైపులైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం గోరుకల్లు రిజర్వాయరు నుంచి మండలంలోని బుగ్గని పల్లెతండా వరకు నీటి సరఫరాకు సంబంధించి ట్రైల్ రన్ విజయవంతమైంది. ఈ నెల 29న మొదట బేతంచెర్ల పట్టణానికి తాగునీటిని మంత్రి బుగ్గన ప్రారంభించనున్నారు. బుధవారం ఏర్పాట్లను చైర్మన్ చలంరెడ్డి, సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్, మెగా కంపెనీ ఇంజనీర్ వాసు, ఏర్పాట్లను పరిశీలించారు.

దొర్నిపాడులో మార్కెట్ ప్రారంభం

దొర్నిపాడు, జనవరి 24: మండలంలోని దొర్నిపాడు గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన సంతమార్కెట్‌ను బుధవారం నాబార్డ్ డీజీఎం మురారి మోహన్ బెహర్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఏపీ జలవనరుల శాఖ సలహాదారులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రారంభించారు. నాబార్డ్ నిధుల కింద రూ.15 లక్షలు, పంచాయతీ నిధులు రూ.10 లక్షలు మొత్తం రూ.20 లక్షలతో సంతమార్కెట్‌ను నిర్మించినట్లు తెలిపారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర యాదవ సంఘం డైరెక్టర్ బత్తుల నాగేశ్వర యాదవ్, జ డ్పీటీసీ శకుంతలారెడ్డి, సర్పంచ్ మంటి దేవమని, మోహన్‌నాయుడు, ఎంపీడీవో వెంకటసుబ్బారెడ్డి, తహసీల్దార్ జయప్రసాదు, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'గ్రామీణ పోస్టాఫీసులను బలోపేతం చేయండి'

ఆళ్లగడ్డ, జనవరి 24: ఆళ్లగడ్డ పోస్టల్ సబ్‌డివిజన్‌లోని గ్రామీణ పోస్టాఫీసుల్లో ప్రజలకు సేవలు చేస్తూనే ఆర్థికంగా బలోపేతం చేయాలని పోస్టల్ సిబ్బందికి నంద్యాల పోస్టల్ సూపరింటెండెంట్ ఎ. శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో పోస్టల్ సిబ్బందికి బుధవారం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జి.చంద్రమౌళీశ్వరరెడ్డి అధ్యక్షతన అవగాహన సదస్సును నిర్వహించారు. 2022-23 సంవత్సరంలో గ్రామీణ పోస్టాఫీసుల్లో అత్యుత్తమ సేవలకు పోస్టల్ సూపరింటెండెంట్ ఎ. శ్రీనివాసులు, సహయ సూపరింటెండెంట్ పార్వతి బహుమతులను ప్రదానం చేశారు. ప్రజలకు పోస్టల్ శాఖ చేపడుతున్న పథకాలపై అవగాహన కల్పించి ఖాతాలను తెరవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాస్కరరావు, రాజు, నరసింహయ్య, జగదీశ్వరరెడ్డి, గీత, సునీత, నరసింహులు, వాసుదేవయ్య, శశిధర్‌లను అభినందించి బహుమతులను అందజేశారు. సమావేశంలో గ్రామీణ పోస్టాఫీసుల బీపీఎంలు, ఏబీపిఎంలు, ఆళ్లగడ్డ పోస్టుమాస్టర్ రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

'బాలికలను బాగా చదివించాలి'

ప్యాపిలి, జనవరి 24: బాలికలను బాగా చదివించాలని హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్రగౌడు తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం పట్టణంలో బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. రాఘవేంద్రగౌడు మాట్లాడుతూ అనేక మంది తల్లిదండ్రులు ఆడబిడ్డలకు చిన్న వయస్సులోనే వివాహాలు చేస్తున్నారను. దీనివల్ల ఆడబిడ్డల భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు. ప్రతి ఆడబిడ్డలను కొడుకులతో సమానంగా చదివించాలన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా నిషేధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

క్రీడలపై పన్ను



క్రీడలపై పన్ను వేసినట్లుగా ఉన్న రసీదు

చాగలమర్రి, జనవరి 24: రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం..ఆంధ్ర అంటూ గ్రామాల్లో క్రీడలపై కూడా పన్నులు విధిస్తున్నారా? అంటూ చాగలమర్రి మేజర్ పంచాయతీ పరిధిలో బుధవారం పన్ను రసీదు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చాగలమర్రి మేజర్ పంచాయతీ ద్వారా జారీ చేసిన పన్ను రసీదులో క్రీడలపై పన్ను విధించడం చర్చనీయాం శంగా మారింది. గ్రామంలోని ఓ ఇంటి యజమానికి ఇంటి పన్ను, నీటి పన్నుతో పాటు క్రీడల పన్ను కింద రూ.23 వేశారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ఈవో నాగమణిని వివరణ కోరగా కొన్ని సంవత్సరాలుగా క్రీడలపై పన్ను వేస్తున్నామని, ఇదేమి కొత్త కాదని ఆమె పేర్కొన్నారు.